క్లుప్తంగా

సోమేశ్వరస్వామికి పూజలు



స్వామివారికి లక్షపత్రి పూజ నిర్వహిస్తున్న పండితులు

రాయవరం: వెంటూరులో ఉన్న పార్వతి సమేత సోమేశ్వరస్వామి వారికి బుధవారం మాస శివరాత్రి పూజలు నిర్వహించారు. మాస శివరాత్రిని గొర్తి రాజేశ్వరిప్రసాద్ సౌజన్యంతో స్వామి వారికి లక్షపత్రి పూజను ఘనంగా నిర్వహించారు. పూజల్లో భాగంగా మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, అమ్మవారికి కుంకుమ పూజను నిర్వహించారు. పూజల్లో తటవర్తి రాఘవరాజు, దువ్వూరి రామారావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పళ్లాలమ్మ తీర్థం

మామిడికుదురు: మొగలికుదురు గ్రామ దేవత పళ్లాలమ్మ తీర్థం బుధవారం వైభవంగా జరిగింది. దీనిలో భాగంగా సిరిబొమ్మను గ్రామంలో ఇంటింటికీ ఊరేగించారు. తీర్థం సందర్భంగా భారీ సంఖ్యలో భక్తులు అమ్మ వారిని దర్శించుకున్నారు. అమ్మవారికి ముడుపులు, మొక్కులు సమర్పించారు. సోమవారం నుంచి అమ్మవారి జాతర మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం భారీ అన్న సమారాధనతో అమ్మవారి జాతర మహోత్సవాలు సంపూర్ణమవుతాయని ఆలయ కమిటీ తెలిపింది. తీర్థం సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని పలు రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు.

ఆర్‌బీకేలతో వ్యవసాయాభివృద్ధి

- ప్రతి సచివాలయ పరిధిలో ఒక రైతు భరోసా కేంద్రం
- క్లస్టర్ పరిధిలో 127 ఏర్పాటు

రాయవరం: వ్యవసాయం దండగ కాదు.. పండగే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరూపించారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడం కోసం, రైతుల ఇబ్బందులను తొలగించేందుకు ప్రభుత్వం తన వంతు కృషి చేసింది. సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు చేరువ చేయడంతో పాటు, సేద్యంలో రైతులకు అవసరమైన సూచనలు, సలహాలు, ఆధునిక టెక్నాలజీని అందించేందుకు ప్రతి సచివాలయం పరిధిలో ఓ రైతు భరోసా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. వ్యవసాయానికి సంబంధించిన అన్ని సేవలను ఆర్‌బీకే ద్వారా అందిస్తున్నారు. వ్యవసాయాభివృద్ధిలో ఇవి ఇతోధిక కృషి చేస్తున్నాయి.

నారు పోసే సమయం నుంచి పంటను అమ్ముకునే వరకూ ప్రతి రైతుకు బాసటగా నిలుస్తున్నాయి. ప్రకృతి వైపరీత్యాలు వచ్చి పంటలు పాడైపోతే రైతులకు పంట నష్టపరిహారం అందించడం, అధిక వర్షాలకు నారు మునిగి పోతే విత్తనాలు ఉచితంగా అందించడం, ఇన్‌పుట్ సబ్సిడీ, తక్కువ ధరకు ఎరువులు, పురుగు మందులు ఇలా ప్రతి విషయంలో రైతుకు ఆర్‌బీకేలు చేదోడు వాదోడుగా ఉంటున్నాయి.

నియోజకవర్గాల పరిధిలో..

రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల పరిధిలో రాయవరం, మండపేట, కపిలేశ్వరపురం, కె.గంగవరం, రామచంద్రపురం, కాజులూరు మండలాలు ఉన్నాయి. వాటి పరిధిలో 127 సచివాలయాలున్నాయి. ప్రతి సచివాలయం పరిధిలో ఒక రైతు భరోసా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ ఆర్‌బీకేల ద్వారా రైతులకు ఎంతో విలువైన సేవలు సకాలంలో అందుతున్నాయి.

ఖాతాలో రైతు భరోసా

రైతులకు పంట సాగు సమయంలో పెట్టుబడి నిధి కింద అర్హులైన రైతులు, కౌలు రైతులకు వైఎస్సార్ భరోసా కింద నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో దఫదఫాలుగా రూ.13,500 జమ చేస్తారు.



ఇన్‌పుట్ సబ్సిడీ

వరి పంట సాగు సమయంలో ప్రకృతి వైపరీత్యాల కారణంగా అధిక వర్షాలు, ఈదురుగాలుల వలన పంట 33 శాతం నష్టం జరిగినప్పుడు ప్రభుత్వం ఎకరాకు రూ.6 వేల నష్టపరిహారంగా రైతుల బ్యాంకుల ఖాతాల్లో జమ చేస్తుంది.

సున్నా వడ్డీ

ఖరీఫ్ సమయంలో వరి నాట్లు వేసే ముందుగా బ్యాంకుల ద్వారా రైతులకు, సీసీఆర్‌సీ కార్డుల ద్వారా కౌలు రైతులకు సున్నా వడ్డీకి ప్రభుత్వం రుణాలు అందజేస్తోంది.

వైఎస్సార్ ఫ్రీ క్రాప్ ఇన్సూరెన్స్

పంట నమోదు ప్రక్రియ ద్వారా పంట నమోదు చేసుకున్న రైతులకు ఉచిత పంటల బీమాను ప్రభుత్వం అందిస్తోంది. ప్రకృతి వైపరీత్యాల సమయంలో నష్టపోయిన పంటకు బీమాను ప్రభుత్వమే రైతుకు అందజేస్తోంది.

వైఎస్సార్ యంత్రసేవా కేంద్రం

ఈ పథకంలో సొంత పొలం కలిగిన ఐదుగురు రైతులు గ్రూపుగా ఏర్పడితే వారికి 40 శాతం సబ్సిడీపై వ్యవసాయ యంత్ర పరికరాలు (ట్రాక్టర్, వరికోత మెసీన్, క్రిషి ట్రాక్టర్, స్ప్రేయర్స్ మొదలైనవి) రైతులకు అందజేస్తారు.

వైఎస్సార్ పొలంబడి

వ్యవసాయ ఖర్చులు తగ్గించుకుని అధిక దిగుబడులు సాధించేందుకు గ్రామంలో 25 మంది రైతులను ఎన్నుకోవడం వారికి సాగులో మెళకువలు నేర్పుతూ వారికి ఒక రోజు శిక్షణ ఇస్తారు. మంగళ, బుధ, గురువారాల్లో వారికి ఈ శిక్షణ కార్యక్రమాలను ఆర్‌బీకేల వద్ద నిర్వహిస్తారు.

పంట నమోదు

రైతు భరోసా కేంద్రం ద్వారా ప్రభుత్వం అందించే సేవలు పొందాలంటే రైతు పంట నమోదు చేయించుకోవాలి. పంట నమోదు ప్రక్రియలో భాగంగా రైతులు తమ బయోమెట్రిక్, బ్యాంకు ఖాతా వివరాలు ఆర్‌బీకేలో అందించాలి.

ఎరువులు, పురుగు మందులు

గతంలో ఎరువులు, పురుగు మందుల కోసం రోజుల తరబడి రైతులు ఆయా దుకాణాల ముందు పడిగాపులు పడేవారు. అయితే ఇప్పుడు రైతు భరోసా కేంద్రాల వద్దనే అంటే అదే గ్రామంలో రైతులకు కావాల్సిన ఎరువులు, పురుగు మందులు మార్కెట్ ధరకన్నా తక్కువ ధరకు అందిస్తారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం

గత ప్రభుత్వాలు ధాన్యం కొనుగోలు కేంద్రం అంటూ మండలానికి ఒకటి లేదా రెండు కేంద్రాలను ఏర్పాటు చేసేవారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతి సచివాలయ పరిధిలో ఉన్న రైతు భరోసా కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశారు.

రైతులకు భరోసా



రైతు భరోసా కేంద్రాలు రైతులకు భరోసాగా నిలుస్తున్నాయి. రైతులకు అన్ని రకాల సేవలు అందించడమే గాకుండా, రైతులకు జవాబుదారీగా ఉంటున్నాయి. ఎరువులు, పురుగుమందుల కోసం గ్రామం దాటి వెళ్లాల్సిన పనిలేకుండా చేశారు. రైతు నిర్భయంగా వ్యవసాయ చేసుకునే పరిస్థితి కల్పించారు. – కొవ్వూరి వెంకటరెడ్డి, కౌలు రైతు, పసలపూడి, రాయవరం మండలం

సాగులో విప్లవాత్మక మార్పులు



గ్రామ స్థాయిలో ప్రతి సచివాలయంలో రైతు భరోసా కేంద్రం ఏర్పాటు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న విప్లవాత్మక చర్యగా చెప్పవచ్చు. రైతు ప్రభుత్వంగా చెప్పడమే కాదు..చేతల్లో చేసి చూపించారు. వ్యవసాయం అంటే దండగ కాదు..పండగ అని నిరూపించారు.

– వెలగల భాస్కరరెడ్డి, రైతు, వి.సావరం, రాయవరం మండలం

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాజులూరు: కుయ్యేరు 33/11 కేవీ విద్యుత్ స్టేషన్ పరిధిలోని మండలంలోని పలు గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏపీ ఈపీడీసీఎల్ కాకినాడ డీఈ జి.ప్రసాద్ తెలిపారు. బుధవారం గొల్లపాలెం మెయిన్ సబ్‌స్టేషన్ ఏఈ ఎం.సూర్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సబ్‌స్టేషన్, విద్యుత్ లైన్ల మరమ్మతుల పనులు, ట్రీ కటింగ్ పనుల్లో భాగంగా ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు. దుగ్గుదుర్రు ఫీడర్ పరిధిలోని దుగ్గుదుర్రు, దుగ్గుదుర్రుపాటి, మేకలగరువు, కుయ్యేరు, ఉప్పుమిల్లి, చింతల్లంక, రేగుబడవ, అంద్రంగి తదితర గ్రామా గృహవాస వినియోగదారులకు, 11 కేవీ ఇండస్ట్రీయల్ ఫీడర్ పరిధిలోని దుగ్గుదుర్ర, కుయ్యేరు, ఉప్పుమిల్లి, పల్లిపాలెం ఆక్వా చెరువులకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు.

మలేరియా వ్యాధిపై అవగాహన

అయినవిల్లి: మలేరియా వ్యాధిపై కొత్తపేట సబ్‌యూనిట్ అధికారి ఎస్.రాజుబాబు ప్రజలకు అవగాహన కల్పించారు. బుధవారం అయినవిల్లిలంకలో మలేరియా వ్యతిరేక మాసోత్సవంలో భాగంగా అయినవిల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. హాజరైన ఎస్.రాజుబాబు మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో మురుగునీరు నిలువ ఉండకుండా చూడాలన్నారు. దోమలు నిల్వ నీటిలో వృద్ధి చెందుతాయన్నారు. దోమ లార్వా ఎలా వృద్ధి చెందుతుందో ఆయన వివరించారు. లార్వా వృద్ధిని అరికట్టాలంటే ట్యాంకుల్లోను, ఇంటి పరిసరాల చెత్త నిలువ ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ప్రసాదరావు, ఎంపీహెచ్ఏ, ఆశా వర్కర్లు తదితరులు ఉన్నారు.

ప్రకృతిని పరిరక్షించుకోవాలి

రామచంద్రపురం: భావితరాల భవిష్యత్ కోసం ప్రకృతిని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందని జూనియర్ సివిల్ జడ్జి వి.నాగేశ్వరరావు నాయక్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక కోర్టుల ప్రాంగణంలో జూనియర్ సివిల్ జడ్జి వి.నాగేశ్వరరావు నాయక్ మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పచ్చదనం ద్వారా పర్యావరణ పరిరక్షణ ఏర్పడుతుందన్నారు. ఇంటింటా మొక్కలు నాటి ప్రకృతిని పరిరక్షించాలని ఆయన కోరారు. పెరిగిపోతున్న కాలుష్యాన్ని తగ్గించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా ప్లాస్టిక్ వాడకాన్ని నిరోధించాలని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు పిల్లి మురళి మోహన్ వెంకటరమణ, వాడ్రేవు సాయి ప్రసాద్, జూనియర్ న్యాయవాదుల ప్రతినిధి పిల్లా పృధ్వి, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు సాలిగ్రామ శ్రీనివాస సుబ్రహ్మణ్యం, మాజీ ఏజీపీకేవీవీ సత్యనారాయణ, న్యాయవాదులు ఐ.శ్రీరామ్, మహిళా న్యాయవాదులు దుర్గాదేవి, కల్యాణి ఆనాల గంగాభవాని, కె.రాజకుమారి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణను బాధ్యతగా భావించాలి

కపిలేశ్వరపురం: పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించాలని అంగర పీహెచ్‌సీ వైద్యాధికారి పి.రత్నకుమారి, సమత స్వచ్ఛంద సంస్థ కో ఆర్డినేటర్ ఈశ్వరి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా బుధవారం మండలంలోని అంగర, కపిలేశ్వరపురం, వల్లూరు, నల్లూరు, అద్దంకివారిలంక, కాలేరు గ్రామాల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని జెడ్పీ ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు మొక్కలు నాటడం, అడవులు, జలాశయాల పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు, అంగన్‌వాడీలు మొక్కలను నాటారు. కార్యక్రమంలో శ్రమ స్వచ్ఛంద సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.



పాఠశాల ఆవరణలో మాట్లాడుతున్న రత్నకుమారి

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

కె.గంగవరం: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని కె.గంగవరం జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు పొడగట్లపల్లి వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని పలు పాఠశాలల్లో ఎంఈఓ చోడిశెట్టి ఆంజనేయులు ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ దినోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కె. గంగవరం ఉన్నత పాఠశాలలో ఆప్‌కాస్ట్ జిల్లా కోఆర్డినేటర్ ప్రక్కి వీరబ్రహ్మనందం, విద్యార్థులతో కలసి హెచ్ఎం వెంకటేశ్వరరావు మొక్కలు నాటారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



నరసాపురపుపేట జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఉపాధ్యాయుడు

రాయవరంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం

రాయవరం: స్థానిక శ్రీరామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం వీఎస్ సునీత ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంఈవో–2 వై.సూర్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హెచ్ఎం సునీత, ఎంఈవో–2 సూర్యనారాయణ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని, ప్రత్యామ్నాయంగా క్లాత్ సంచులను, జనపనార సంచులను ఉపయోగించాలన్నారు. ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే నష్టాన్ని విద్యార్థులకు వివరించారు. విద్యార్థులందరూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఇంటింటా చెట్లు పెంచాలని, ఖాళీ ప్రదేశాలలో రహదారి వెంబడి మొక్కలు నాటాలని హితవు పలికారు. కార్యక్రమంలో స్థానిక నేతలు వుండవిల్లి రాంబాబు, వల్లూరి శ్రీనివాస్, మల్లిపూడి చిన్న, వుండవిల్లి శివ, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని మనం రక్షిస్తే.. పర్యావరణం మనల్ని రక్షిస్తుంది

రామచంద్రపురం రూరల్: పర్యావరణాన్ని మనం రక్షిస్తే..పర్యావరణం మనల్ని రక్షిస్తుందని రామచంద్రపురం ఎంఈఓ మానుపూడి శ్రీనివాస్ అన్నారు. పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని రామచంద్రపురం పట్టణం, రూరల్ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో ఎంఈఓ మానుపూడి శ్రీనివాస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహనా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కోర్టుల ప్రాంగణంలో మొక్కలు నాటుతున్న జూనియర్ సివిల్ జడ్జి నాగేశ్వరరావు నాయక్



రాయవరం ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటుతున్న ఎంఈవో-2 సూర్యనారాయణ, హెచ్ఎం సునీత, స్థానిక నేతలు



కె.గంగవరం జెడ్పీ హైస్కూల్‌లో మొక్కలు నాటుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

ముగిసిన పోలేరమ్మ తీర్థం



అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

కాజులూరు: ఆర్యావటంలో గత మూడు రోజులుగా జరుగుతున్న గ్రామ దేవత పోలేరమ్మతల్లి జాతర మహోత్సవాలు బుధవారంతో ముగిశాయి. గ్రామంలో సుమారు 300 సంవత్సరాల క్రితం వెలసిన పోలేరమ్మతల్లిని ప్రజలు కొలుస్తున్నారు. ఏటా వైశాఖ మాసం అమావాస్య రోజున అమ్మవారికి తీర్థ మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం రాత్రి చిన్న జాతర, మంగళవారం రాత్రి పెద్ద జాతర మహోత్సవాలు నిర్వహించి సాంస్కృతిక కార్యక్రమాలు, గరగ నృత్యాలతో అమ్మవారిని తెల్లవారే వరకు వీధుల్లో ఊరేగించారు. అనంతరం బుధవారం వేకువ జామునుంచి ఆలయం వద్ద తీర్థమహోత్సవాలు నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు తగిన వసతి ఏర్పాట్లు చేశారు.

సత్తెమ్మ తల్లి సంబరం

రాయవరం: వెదురుపాక–ఆరికరేవుల రహదారిలో పంట పొలాల మధ్య ఉన్న సత్తెమ్మ తల్లి అమ్మవారి జాతర బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ నిర్వాహకుడు ఎం.సురేష్ ఆధ్వర్యంలో నాలుగు రోజుల పాటు అమ్మవారి ప్రతిరూపాలైన గరగలను గ్రామోత్సవం చేపట్టారు. అమ్మవారి సంబరాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన శక్తివేషాలు, గరగనృత్యాలు వంటి సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను ఆకట్టుకున్నాయ. వెదురుపాక, ఆరికరేవులు, మెళ్లూరు తదిర గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సురేష్ ఆధ్వర్యంలో భారీ అన్న సమారాధన నిర్వహించారు.

ఘనంగా తాటమ్మ వారి పెద జాగరం

పి.గన్నవరం: గ్రామ దేవత తాటమ్మ వారి తీర్థ మహోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి అమ్మవారి పెదజాగరం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయం వద్ద మహిళలు, చిన్నారులు కాగడాలు వెలిగించి, మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. గురువారం జరిగే తీర్థ మహోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకోవాలని ఆలయ ట్రస్టీ సుంకర రాంబాబు విజ్ఞప్తి చేశారు.

ఉపకార వేతనానికి ఎంపికైన సుష్మశ్రీ

సఖినేటిపల్లి: మోరి జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థిని చింతా సుష్మశ్రీ గత డిసెంబర్‌లో జరిగిన ఎన్ఎంఎంఎస్ (నేషనల్ మీన్స్ అండ్ మెరిట్ స్కాలర్‌షిప్) పరీక్షలో అర్హత సాధించినట్టు పాఠశాల హెచ్ఎం శ్రీనివాసన్ శ్రీధర్‌కృష్ణ బుధవారం తెలిపారు. ఐదేళ్ల పాటు కేంద్ర ప్రభుత్వం అందించే జాతీయ ఉపకార వేతనానికి సుష్మశ్రీ ఎంపిక అయిందన్నారు. దీని ద్వారా ఏటా రూ.12 వేలు చొప్పున ఐదేళ్ల పాటు విద్యార్థిని ఖాతాకు నిధులు జమ అవుతాయని ఆయన తెలిపారు. కాగా ఉపకార వేతనానికి ఎంపికై న విద్యార్థినికి పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ జాన శంకర రావు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ ముప్పర్తి శ్రీనివాసరావు అభినందనలు తెలిపారు.



పాడి పశువుల పోషణలో జాగ్రత్తలు

- కూరగాయలు, పండ్ల తొక్కలనూ పశువులకు మేతగా అందించవచ్చు



డాక్టర్ ఎ.నాగశ్రావణి

రాయవరం: పాడి పశువుల పోషణలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి. పశుగ్రాసం కొరత ఏర్పడినప్పుడు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. దానిని అధిగమించేందుకు పశువైద్యుల సలహాలు సూచనలు తీసుకొని, తప్పనిసరిగా పాటించాలి. పశువులకు మేత లభించనప్పుడు రైతులు వ్యవసాయ వ్యర్థ పదార్థాలను దాణాగా ఉపయోగించవచ్చని మాచవరం పశువైద్యాధికారి ఎ.నాగశ్రావణి తెలిపారు. ఆ వివరాలు ఆమె మాటల్లోనే...

వ్యవసాయ వ్యర్థపదార్థాల వినియోగం

చిక్కుడు తీగలు, బెండ, టమోట, కాలీఫ్లవర్, క్యాబేజీ, అరటి, వేరుశెనగరొట్ట, చెరకు ఆకులు వంటివి వ్యవసాయ వ్యర్థాలను మేతగా ఇవ్వవచ్చు. వాటిని ఎండబెట్టిగాని, తాజాగా గాని, పాతరగడ్డిగా కాని వినియోగించుకోవచ్చు.

ఇక కూరగాయల మార్కెట్లో లభించే వ్యర్థాలు, మిగిలిపోయిన ఆకుకూరలు, హోటళ్లు, ఫంక్షన్ హాలు వద్ద లభించే కూరగాయ తొడిమలు, తొక్కల, ఇతర వ్యర్థాలు పశువులకు ఆహారంగా ఉపయోగపడతాయి. అలాగే అనాస, అరటి, బత్తాయి, పుచ్చ, ద్రాక్ష, మామిడి జ్యూస్ కేంద్రాల వద్ద లభించే పిప్పికూడా పశువులకు ఆహారంగా ఉపయోగపడతాయి.



కాలువల్లో లభించే గుర్రపుడెక్క

గుర్రపుడెక్క

చెరువులు, కాలువల్లో అధికంగా గుర్రపుడెక్క ఉంటుంది. దీని ఆకులు, కాడల్లో పశువులకు కావలసిన పోషక పదార్థాలు ఉన్నాయి. 16శాతం మాంసకృతులు ఉంటాయి. దీనిని ఆరబెట్టిగాని, ఎండబెట్టిగాని 30 శాతం మించకుండా ఇవ్వాలి.

ఆకుల్లో మాంసకృతులు

సుబాబుల్ ఆకుల్లో 20 శాతానికి పైగా మాంసకృతులు ఉంటాయి. ఇవే కాకుండా చెరకు, మునగ, అవిసె, వేప, మర్రి, రావి, మామిడి, పనస, నేరేడు వంటి చెట్ల ఆకుల్లో పోషక పదార్థాలతో పాటు ఔషధ గుణాలు కూడా ఉంటాయి. వీటిని పశువుల దాణాగా ఉపయోగించవచ్చు.



ఎండుగడ్డి మేస్తున్న పశువు

చిన్నారులకు టీకాలు తప్పనిసరి

ఆలమూరు: చిన్నారులకు నిర్ణీత సమయంలో విధిగా టీకాలు వేయించాలని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు డి.మల్లికార్జున, పి.భవానీశంకర్ అన్నారు. ఆయా పీహెచ్‌సీల పరిధిలోని సబ్ సెంటర్లతో పాటు ఆలమూరు ప్రభుత్వ ఆస్పత్రిలో హెల్త్ సిబ్బంది బుధవారం చిన్నారులకు టీకాలు వేశారు. సీహెచ్ఓ పి.రాధాకృష్ణ, కె.జ్యోతికుమార్, హెల్త్ ఎడ్యుకేటర్ ఏవీవీ రాజా, ఎంపీహెచ్ఈఓ బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి.ఉమ, ఆర్.బాలమణి తదితరులు వైద్యసేవలను పర్యవేక్షించారు. పినపళ్ల, చింతలూరు, పెనికేరు, చొప్పెల్ల, చెముడులంక, మడికి, గుమ్మిలేరు, నర్శిపూడి గ్రామాల్లో చిన్నారులకు టీకాలు, బాలింతలకు, గర్భిణులకు ఇంజక్షన్లు అందజేశారు. ధనుర్వాతం, కామెర్లు, క్షయ, పోలియో, డిఫ్తీరియా, కోరింత దగ్గు నివారణకు టీటీ, డీపీటీ, మీజిల్స్, పీసీవీ, పెంటావాలెంట్, ఎంఆర్, హెపటైటిస్–బీ వ్యాక్సిన్లను అందజేశారు.

నాలెడ్జ్ పెంచేందుకే శిక్షణ తరగతులు



మామిడికుదురులో శిక్షణ పొందిన విద్యార్థులు

మామిడికుదురు: గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న విద్యార్థుల్లో నాలెడ్జ్‌ను పెంచేందుకే ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించామని ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు భూపతి మనోహర్‌రాజు, కారుపల్లి కల్యాణ్‌బాబు పేర్కొన్నారు. మామిడికుదురు అంబేడ్కర్ సామాజిక భవనంలో గత నెల 20 నుంచి గ్రామీణ ప్రాంతాలకు చెందిన 3 నుంచి పదో తరగతి వరకు విద్యార్థులకు నిర్వహించిన భీమ్ విజ్ఞాన కేంద్రం సమ్మర్ క్లాసుల ముగింపు కార్యక్రమం బుధవారం జరిగింది. విద్యార్థులకు మ్యాథ్స్, ఇంగ్లిష్, సైన్స్ సబ్జెక్టుల్లో బేసిక్ నాలెడ్జ్‌ను పెంచేందుకు ఈ శిక్షణ తరగతులు నిర్వహించామన్నారు. ఇవి విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడ్డాయన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు నేల శ్రీనివాసరావు, భూపతి వెంకటపతి, బత్తుల నకులరాజు, గోసంగి బంగార్రాజు, గెద్దం ప్రదీప్, నీతిపూడి చంద్రరావు, సాధనాల సత్యనారాయణ, బత్తుల రమేష్‌బాబు, బయ్యా మోహనరావు పాల్గొన్నారు.